క్లుప్తంగా

రాంజీ సక్పాల్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో బీఆర్ అంబేడ్కర్ తండ్రి రాంజీ సక్పాల్ 112వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ బ్రిటీష్ సైన్యంలో సుబేదార్‌గా పని చేసిన సక్పాల్ అంటరానితనం, అసమానతలతో కూడిన సమాజంలో తన కుమారుడు అంబేడ్కర్‌ను చదివించడంలో వెనుకడుగు వేయలేదన్నారు. కార్యక్రమంలో బీఎస్‌పి జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, విలాస్ ఖోబ్రగడె, రాజేంద్రప్రసాద్, రోషన్, విజేయ్, రాకేశ్ దుర్గె, హంసరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బెజ్జూర్: లక్షల డప్పులు –వేల గొంతుకలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండ్ర బ్రహ్మయ్య మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఈనెల 7న తలపెట్టిన లక్షల డప్పులు వేల గొంతుకలు కార్యక్రమానికి భారీగా తరలిరావాలని కోరారు. జిల్లాలోని ప్రతీ మండలంలోని గడపగడప నుంచి ప్రతీఒక్క మాదిగ బిడ్డ బయల్దేరి రావాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పెగడపల్లి తిరుపతి, నాయకులు చిప్పకుర్తి పురుషోత్తం, అడ్డూరి శ్రీనివాస్, ఇప్ప శేఖర్, తైదల ఇస్తారి, పేగడపల్లి సురేశ్, తోటపల్లి మహేశ్, చిప్పకుర్తి రంగయ్య, చిప్పకుర్తి సంజీవ్, రాజేశ్, తోటపల్లి ప్రవీణ్ పాల్గొన్నారు.

పరామర్శ



దేశ్‌పాండె కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సతీశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: పట్టణంలోని బ్రాహ్మణవాడలో ఇటీవల మృతిచెందిన స్వాతంత్ర్య సమరయోధులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు దండనాయకుల శ్రీనివాస్‌రావు కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ పరామర్శించారు. అనంతరం దస్నాపూర్‌కు చెందిన శ్రీకృష్ణ హోటల్ యజమాని షిండే గణేశ్ కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట నాయకులు అమర్, తన్ను, ప్రతాప్, తదితరులు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్సై

కౌటాల: గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో రాణించాలని ఎస్సై ఎస్.మధుకర్ అన్నారు. ఆదివారం మండలంలోని ముత్తంపేట్ గ్రామంలో జీపీ లెవల్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీలు నిర్వహించడానికి సహకరిస్తామన్నారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలని తెలిపారు. పోటీల్లో 30 జట్లు పాల్గొంటున్నాయని, మొదటి బహుమతి రూ. 30 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆదే శ్రీనివాస్, సత్యనారాయణ, దోని రవి, శంకర్, సుక్కుజి, బండురావు, నిర్వాహకులు ఆకాశ్, రవితేజ, నరేశ్, రవి, మహేశ్, సోను తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

నార్నూర్: ప్రధాన్ సమాజ్ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులను ఆదివారం గాదిగూడ మండల కేంద్రంలోని హిరాసుక్క కమ్యూనిటీ హాల్‌లో ప్రధాన్ సమాజ్ పెద్దలు ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడు ఉయిక సుదర్శన్ మాట్లాడుతూ ప్రధాన్‌మాజ్ అభివృద్ధికి సంఘం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందన్నారు.

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం!

- మండోకర్‌వాడలో ఎక్కడ పడితే అక్కడే చెత్తకుప్పలు
- పాఠశాల పరిసరాల్లోనూ అపరిశుభ్రత
- దృష్టి సారించాలని కోరుతున్న కాలనీవాసులు



పాఠశాల మరుగుదొడ్ల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం



మండోకర్‌వాడలో పేరుకుపోయిన చెత్త

వాంకిడి: మండల కేంద్రంలోని మండోకర్‌వాడలో పారిశుధ్యం లోపిస్తోంది. ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోయి పరిసరాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. మురికి కాలువలు సైతం అడ్డదిడ్డంగా నిర్మించడంతో మురుగునీరు సరిగ్గా వెళ్లడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. కాలువల నిర్మాణం ఇరుకుగా చేపట్టడంతో చెత్త తీయాలన్నా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. నివాస ప్రాంతాల్లోనే చెత్త పేరుకుపోయి పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయని, దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు దృష్టి సారించి నిత్యం కాలనీలో పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

కాలనీలో సమస్యలు ఇలా..

వాంకిడి గ్రామ పంచాయతీ కేంద్రంలోని మండోకర్‌వాడలో మురుగు నీరు వెళ్లేందుకు సరైన వ్యవస్థ ఏర్పాటు చేయలేదు. కాలువలు ఇరుకుగా నిర్మించడంతో మురుగు నీరు ముందుకు పారడం లేదు. మరికొన్ని అంతర్గత రహదారులకు ఇప్పటికీ సీసీ వేయకపోవడంతో వర్షాకాలంలో బురదతో ఇబ్బందులు పడుతున్నారు. ఆ కాలనీ చిక్లీ వాగుకు ఎగువ ప్రాంతంలో, ఒర్రెకు సమీపంలో ఉండటంతో భారీ వరదలు సంభవించిన ప్రతీసారి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దానికి తోడు కాలువలు లేకపోవడంతో మురుగు నీరు, వర్షపు నీరు నివాసాల్లో చేరుతుందని ప్రజలు వాపోతున్నారు. కాలనీలో పారిశుధ్యంపై పంచాయతీ అధికారులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కొన్ని నెలలుగా నివాస పరిసరాలకు సమీపంలోనే చెత్త పేరుకుపోయి ఉన్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మండోకర్‌వాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమీపంలోనే పరిసరాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. విద్యార్థుల కోసం నిర్మించిన మరుగుదొడ్లకు ఆనుకొని చెత్త పేరుకుపోయింది. ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోయి ఉండటంతో పిల్లలు, పెద్దలు వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు కాలనీలో లోపించిన పారిశుధ్యంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ప్రారంభానికి నోచుకోని సెగ్రిగేషన్..

గత ప్రభుత్వ హయాంలో చెత్త నిర్వాహణ కోసం ప్రతీ జీపీకి ఒకటి చొప్పున సెగ్రిగేషన్ షెడ్డు నిర్మించారు. వాంకిడి జీపీకి చెందిన షెడ్డు 2021లో వచ్చిన భారీ వరదలకు కొట్టుకుపోగా మళ్లీ వాగుకు దిగువ ప్రాంతంలో పంచాయతీ నిధులతో నూతనంగా నిర్మించారు. నిర్మాణం పూర్తయ్యి దాదాపు ఐదు నెలలు పూర్తయినా ఇప్పటి వరకు ప్రారంభించలేదు. దీంతో సేకరించిన చెత్తను చిక్లీవాగు పరిసరాల్లో నిప్పు పెట్టి కాల్చేస్తున్నారు. చెత్తలో అత్యధికంగా ప్లాస్టిక్ ఉండటంతో పర్యావరణానికి హానీ కలుగుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి చెత్త నిర్వహణ విధిగా చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇష్టానుసారంగా మురికి కాలువల నిర్మాణం



భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్మించాల్సిన మురికి కాలువలు ఇష్టానుసారంగా నిర్మించారు. అందులో చెత్త తొలగించేందుకు కూడా వీలు లేకుండా ఉంది. వర్షాలకు వరద నీరు ఇళ్లలో చేరుతోంది. ఇంకా అనేక చోట్ల కాలువలు నిర్మించాల్సి ఉంది. పంచాయతీ అధికారులు దృష్టి సారించి నూతనంగా మురికి కాలువలు నిర్మించాలి.

– మందోకర్ ప్రకాశ్

చెత్తకుప్పలు పేరుకుపోయాయి



కాలనీలో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. నివాస ప్రాంతాలకు సమీపంలోనే రహదారికి ఇరువైపులా పారిశుధ్యం లోపించింది. కొన్ని నెలలుగా చెత్త తొలగించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా మారింది. సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

– మందోకర్ విలాస్

డబుల్ రోడ్డు నిర్మాణానికి
మోక్షం కలిగేనా?



దహెగాం నుంచి కోత్మీర్ వరకు ఉన్న సింగిల్ రోడ్డు

- 2023లో నిధులు మంజూరు
- ఇంకా ప్రారంభం కాని పనులు
- ఇబ్బందుల్లో ప్రజలు
- పట్టించుకోని అధికారులు
- 13 కిలోమీటర్లకు రూ. 32కోట్లు మంజూరు

దహెగాం: గత ప్రభుత్వం మండలంలోని కోత్మీర్ నుంచి దహెగాం మండల కేంద్రం వరకు డబుల్ రోడ్డు నిర్మాణం కోసం రూ.32 కోట్లు మంజూరు చేసింది. గత సంవత్సరం టెండర్లు సైతం పూర్తి చేసిన అధికారులు పనులు మాత్రం కొనసాగించడం లేదు. దీంతో డబుల్ రోడ్డు నిర్మాణానికి మోక్షం కలిగేనా..? అని మండల వాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగజ్‌నగర్ నుంచి మండలంలోని కోత్మీర్ వరకు 18 కిలోమీటర్లు డబుల్ రోడ్డు నిర్మాణానికి గత ఐదు సంవత్సరాల క్రితం నిధులు మంజూరు చేసి రోడ్డు కూడా పూర్తి చేశారు. కోత్మీర్ –దహెగాం మండల కేంద్రం వరకు సింగిల్ రోడ్డు ఉండడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

రూ.32 కోట్లు మంజూరు..

మండల కేంద్రం నుంచి కోత్మీర్ వరకు సుమారు 13 కిలోమీటర్లు సింగిల్ రోడ్డు ఉంది. ఉన్న రోడ్డుపై అత్యంత ప్రమాదకరంగా మూలమలుపులు ఉన్నాయి. మండలంలోని ఐనం గ్రామంలో మూలమలుపులు ఎదురుగా వస్తున్న వాహనం సైతం కనిపించనంత ప్రమాదకరంగా ఉన్నాయి. పైగా సింగిల్ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు ఆనుకుని కంచెలు ఉండడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూలమలుపుల వద్ద ఎలాంటి ప్రమాద సూచిక బోర్డులు సైతం ఆర్‌అండ్‌బీ శాఖ ఏర్పాటు చేయలేదు. దహెగాం నుంచి కాగజ్‌నగర్ 30 కిలోమీటర్లు ఉండగా ప్రయాణం గంటకు పైగా సమయం పడుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. కాగా గత రెండు నెలల క్రితం పనులు ప్రారంభించి రోడ్లకిరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను సైతం తొలగించారు. కానీ అర్ధాంతరంగా పనులు నిలిచిపోయాయి.

వర్షాకాలంలో ఇబ్బందులు..

మండల కేంద్రం నుంచి కాగజ్‌నగర్ పట్టణం 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. నిత్యం అవసరాల నిమిత్తం ప్రజలు, వ్యాపారులు కాగజ్‌నగర్‌కు వందలాది మంది వెళ్తుంటారు. గత రెండు సంవత్సరాల క్రితం భారీ వరదల కారణంగా మండలంలోని బీబ్రా, పెసరికుంట గ్రామాల సమీపంలో రోడ్డు కోతకు గురైంది. దీంతో వర్షాకాలంలో రోడ్డు బురదగా మారి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని వాపోతున్నారు. ఉన్న సింగిల్ రోడ్డు సైతం గుంతలమయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబుల్ రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేపట్టడం లేదని, అధికారులు సైతం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

పాఠశాలలో నీటి కష్టాలు..!

వాంకిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం 'మన ఊరు –మన బడి' 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ' వంటి పథకాలు అమలు చేస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో అవి పూర్తిగా అమలుకు నోచుకోవడం లేదు. మండల కేంద్రంలోని మండోకార్‌వాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నీటి సౌకర్యం కోసం నూతనంగా ట్యాంకులు, నల్లాలు బిగించారు. కొన్ని నెలల పాటు బాగానే ఉన్నా తర్వాత బోరు పాడైపోవడంతో అంతా అలంకార ప్రాయంగా మారాయి. నీళ్లు లేక మరుగుదొడ్లు మూసివేయడంతో విద్యార్థులు బహిరంగ ప్రదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. బోరు మోటర్ పాడైపోయి నెల రోజులు దాటినా మరమ్మతులు చేయించడం లేదు. ఈ విషయంపై అక్కడ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు విద్యాసాగర్‌ను వివరణ కోరగా సదరు కాంట్రాక్టర్‌కు సమాచారం ఇచ్చామని తెలిపారు. నెలలు గడిచినా అధికారులు పట్టించుకోకపోవడంతో పాఠశాలలోని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.



నిరుపయోగంగా నల్లాలు, ట్యాంకు

మైదానం ఏర్పాటు చేయరూ..?

- గ్రామాల్లో కనిపించని క్రీడా ప్రాంగణాలు
- పత్తి చేలల్లోనే ఆటలు
- ఇబ్బందులు పడుతున్న యువత



పత్తి చేనులో క్రికెట్ ఆడుతున్న యువకులు

పెంచికల్‌పేట్: గ్రామాల్లో క్రీడలకు మైదానాలు లేక క్రీడాకారులు పత్తి చేలను మైదానాలుగా మార్చుకొని ఆటలు ఆడుతున్నారు. గత ప్రభుత్వం గ్రామాల్లో క్రీడలను పోత్సహించడానికి ప్రతీ గ్రామంలో క్రీడా ప్రాంగణాలను తూతూ మంత్రంగా ఏర్పాటు చేసింది. కానీ గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు కనుమరుగుకావడంతో యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పత్తి చేలను తాత్కాలికంగా చదును చేసి మైదానాలుగా మార్చుకుని క్రికెట్, వాలీబాల్ ఆటలు ఆడుతున్నారు.

మండలంలో..

నూతనంగా ఏర్పడిన పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో ప్రభుత్వ భూమి ఉన్నా కూడా క్రీడలకు మైదానం లేదు. గత కొన్నేళ్లుగా మండల కేంద్రంలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న అటవీశాఖ భూమిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఇటీవల అటవీశాఖ అధికారులు క్రీడలకు అనుమతులు ఇవ్వకపోవడంతో యువకులు, క్రీడాకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో వందల ఎకరాల్లో ప్రభుత్వ భూములు ఉన్నా అధికారులు మైదానం కోసం భూమిని కేటాయించడంలో విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైదానాలు లేక సొంత ఖర్చులతో పత్తి చేలను చదును చేస్తూ ఆటలు ఆడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రీడల కోసం మైదానం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలి



గ్రామాల్లో క్రీడలకు ప్రాంగణాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. గతంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు కనుమరుగయ్యాయి. పంట చేలను చదును చేసి ఆటలు ఆడుకుంటున్నాం. అధికారులు స్పందించి ప్రతీ గ్రామానికి మైదానం కోసం భూమి కేటాయించాలి.

– వెంకటేశ్, అగర్‌గూడ

స్థలం కేటాయించాలి



నూతనంగా ఏర్పడిన పెంచికల్‌పేట్ మండల కేంద్రానికి అధికారులు మైదానం కేటాయించాలి. మైదానాలు లేక క్రీడాకారులు, యువకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటలు ఆడుకోవడానికి ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి మైదానం కోసం స్థలం కేటాయించాలి.

– పుల్గం భాస్కర్, ఎల్కపల్లి

భక్తిశ్రద్ధలతో అరుణ హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పెద్దవాగు సమీపంలోని బాలేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీన ప్రారంభమైన నవరాత్రోత్సవాలు ఆదివారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఆదివారం ఆలయంలో అర్చకులు శ్రీధర్ ఆధ్వర్యంలో గన్యాంతర పూజలు, రోగ్యం భాస్కరాదిచ్ఛేత్, రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా విశేషంగా సూర్య భగవానుడి అనుగ్రహం ద్వారా సంపూర్ణ ఆయువు, పరిపూర్ణ దేహ ఆరోగ్యానికి సూర్యనారాయణుడికి ప్రీతిగా 'అరుణ హోమం' నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు అజయ్, విజయ్‌కుమార్ శర్మ, బాలేశ్వర్, సింగాడే అశోక్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆసిఫాబాద్‌అర్బన్: నేడు వసంత పంచమి, సాయిబాబా ఆలయం 26వ వార్షికోత్సవం నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆలయంలో అర్చకులు మధుకర్‌శర్మ, సాయిశర్మ, ప్రసాద్‌శర్మల ఆధ్వర్యంలో గణపతిపూజ, పేణ్యావచనం, అఖండ దీపస్థాపన, విష్ణుసహస్ర నామ సహిత నవగ్రహ వాస్తు సరితోభద్ర మండల స్థాపనలు, హోమం నిర్వహించి తీర్థప్రసాద వితరణ చేశారు. సోమవారం వసంత పంచమి సందర్భంగా ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి అభిషేకం, ఉదయం 10 గంటలకు పూర్ణాహుతి, సాయంత్రం 6 గంటలకు పల్లకిసేవ, మధ్యాహ్నం 12 గంటల నుంచి మహాఅన్నప్రసాద వితరణ, రాత్రి భజనా కార్యక్రమాలు చేపట్టనున్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

తాంసి: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని గోట్కూరి గ్రామంలో సీపీఐ శతాబ్ది ఉత్సవాలను మండల సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఐ జెండా ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. గత శతాబ్ద కాలంగా సీపీఐ అన్నివర్గాల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తుందన్నారు. నాయకులు రమేశ్, కట్ట స్వామి పాల్గొన్నారు.

16న సరస్వతి విద్యాపీఠం మహా సమ్మేళనం


ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని సరస్వతి విద్యాపీఠం పాఠశాలలో ఈనెల 16వ తేదీన విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ అధ్యక్షుడు గద్దెలపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శిశుమందిర్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల మహా సమ్మేళన కార్యక్రమంలో 1979 పాఠశాల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు చదివిన విద్యార్థులతో పాటు, ఇతర ప్రాంతాల్లో శిశుమందిర్‌లో చదివి ప్రస్తుతం ఆసిఫాబాద్‌లో ఉంటున్న వారు సైతం పాల్గొనాలని కోరారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు, గురువులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నిర్వాహకులు సిద్ధం శెట్టి క్రుపాల్, వెంకటరమణ, రఘువీర్, సాయికిరణ్, ప్రశాంత్, రాహుల్, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు గుండేటి కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఉచిత కంటి వైద్య శిబిరం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్‌లో గల వేదమందిర్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా లయన్ డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కొత్తపల్లి వెంకటలక్ష్మి –చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ, లయన్స్‌క్లబ్ సహకారంతో గత 9 సంవత్సరాలుగా లయన్స్‌క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి ఆస్పత్రిలో 10 వేల మందికిపైగా కంటి ఆపరేషన్లు చేయించి వృద్ధులకు అండగా నిలిచినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ కాళిదాస్ మండల్, హరిదాస్‌సర్దార్, ఠాగూర్ రాయ్, బిశ్వాస్, అభీంద్రనాథ్, మహానంద మండల్, రన్వీర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు

నార్నూర్: పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని మాతంగ్ ఋషి సంస్కార సంఘం వ్యవస్థాపకులు సూర్యవంశీ పండరి అన్నారు. ఆదివారం మండలంలోని తడిహత్నూర్ మతంగ్ సమాజ జీవన జన జాగృతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మతంగ్ సమాజం మూఢనమ్మకం, చెడు వ్యసనాలకు అలవాటు పడి ఆర్థికంగా, మానసికంగా నష్టపోతున్నారన్నారు. ప్రతీరోజు ధ్యానం చేసుకోవాలి, తల్లిదండ్రులకు సేవ చేయాలి, యోగా, వ్యాయమం చేయాలని సూచించారు. నేషనల్ మెటరియాంజి ఒంపియాడ్ ఎర్థ సైంస్ క్లైమెట్ చేంజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచిన కుమారి సోనీ, నాందేవ్ సోన్ కాంబ్లేలను సన్మానించారు. కార్యక్రమంలో దళిత రత్న అవార్డు గ్రహీత నర్సింగ్ మోరే, పాండురంగ్, సదాశివ్ మిటే, కలవలే అరవింద్, వాగ్మారె వామన్ పాల్గొన్నారు.